ప్రజాశక్తి

మంగళవారం 11 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సమస్యలతో సతమతం

- మరుగు దొడ్లకు తలుపులు కొరత
- కుక్, వాచ్‌మ్యాన్ పోస్టులు ఖాళీ



తలుపులు లేకుండా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి -కశింకోట, కె.కోటపాడు

కశింకోట బిసి బాలుర వసతి గృహం విద్యార్థులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ వసతి గృహంలో 3 నుండి 10వ తరగతి మొత్తం 120 మంది విద్యార్థులు ఉండేందుకు అవకాశముంది. ప్రస్తుతం 52 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ వసతిగృహంలో తాగు నీటి కోసం ఆర్‌ఒ ప్లాంట్ లేదు. ప్రస్తుతం వాచ్ మెన్, కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థుల మరుగుదొడ్లలో కొన్నింటికి తలుపులు పోయాయి. ఈ వసతి గృహం నిర్మాణం చేపట్టిన నుండి ప్రహరీ లేకపోవడంతో ఇతరులు ప్రవేశిస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి హాస్టల్ వెల్ఫేర్ అధికారి జె. నారాయణరావును సంప్రదించగా తాను ఆగస్టు నెలలో ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టానని, మరుగుదొడ్లు, ప్రహరీ, ఖాళీ పోస్టులు, పిల్లలు సీట్లు భర్తీపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

చిన్న గదిలోనే వంట..

కె.కోటపాడు : కె.కోటపాడు మండలంలో ఒక సమీకృత వసతిగృహం, బిసి బాలుర వసతి గృహం, కొరువాడలో కాలేజీ హాస్టల్ వసతి గృహం ఉన్నాయి. వాటిలో సమీకృత వసతి గృహానికి ఎ.కోడూరులో ఇటీవల భవనాలు నిర్మించడంతో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులు సమకూరాయి. హాస్టల్ మెయిన్ గేటు వద్ద మురుగు నీరు నిల్వ ఉంది. కొరువాడ వసతి గృహం పురాతనమైనది కావడంతో శ్లాబ్ పెచ్చుతు ఊడి పడుతున్నాయి. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలేజీ హాస్టల్ వసతి గృహం పురాతనమైనది కావడంతో శ్లాబ్ నుంచి వర్షపు నీరు కారుతోంది. దీని వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

12వ తేదీకి ఏర్పాట్లు పూర్తి కావాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఎయు ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లు 12వ తేదీ సాయంత్రానికి పూర్తి కావాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్కడా ఎలాంటి సమన్వయ లోపం రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో భారత ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు భాగస్వామ్యం కానున్నారని, పక్కా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ సదస్సుకు ఈ నెల 12వ తేదీ రాత్రికే ముఖ్యమంత్రి నగరానికి చేరుకుంటారని చెప్పారు. 13న సిఐఐ, రాష్ట్రస్థాయి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారని, ప్రాథమిక స్థాయి సమావేశాలు నిర్వహిస్తారని, సాయంత్రం అతిథులతో కలిసి గాలా డిన్నర్‌లో పాల్గొంటారని తెలిపారు. సాధ్యమైనంత వరకు డెలిగేట్ కిట్లను రిజిస్ట్రేషన్ సమయంలోనే అందజేయాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ ఉండదని స్పష్టం చేశారు. విఐపి, వివిఐపి పార్కింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాలు ఏర్పాటుచేయాలని చెప్పారు. రేంజ్-1 డిఐజి గోపానాథ్‌జెట్టీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జివిఎంసి కమిషన్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు.

విశాఖపట్నం రేంజ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రేంజ్ పరిధిలోని పోలీసు శాఖలో తొమ్మిది మంది పోలీసు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. బొడ్డేపల్లి సుధాకర్ డిసిఆర్‌బి విజయనగరం జిల్లా నుంచి కీలకమైన అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. విశాఖపట్నం రేంజ్‌లో విఆర్‌లో ఉన్న కె.కుమార స్వామిని డిసిఆర్‌బి విజయనగరం జిల్లాకు కేటాయించారు. విఆర్‌లో ఉన్న సీవలస లక్ష్మణరావును ఎన్‌డిపిఎస్ టాస్క్ ఫోర్స్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఎన్‌డిపిఎస్ టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న సువ్వారి రామును విఆర్‌కు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం ఉమెన్ పిఎస్ ఇన్‌స్పెక్టర్ వనపల్లి రామారావును ఆ జిల్లాలోని ట్రాఫిక్ పిఎస్‌కు బదిలీ చేశారు. విఆర్‌లో ఉన్న కంది నీలిమను ఉమెన్ పిఎస్ అనకాపల్లి జిల్లాకు కేటాయించారు. విఆర్‌లో ఉన్న బొంగు నరిమానిని ఉమెన్ పిఎస్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. అచ్చుతాపురం ఉమెన్ పిఎస్ (అనకాపల్లి జిల్లా)లో ఉన్న నమ్మి గణేష్‌ను విఆర్‌కు, అనకాపల్లి ఉమెన్ పిఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌వివిఎస్‌ఎస్.శేఖరరావును అచ్యుతాపురం ఉమెన్ పిఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రెవెన్యూ క్రీడల్లో విశాఖ జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం

వార్త 2లో..

ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

వార్త మెయిన్‌లో..

సామాన్యుడిపై ధరల పిడుగు

వార్త 5లో..

ఘనంగా సిపి.బ్రౌన్ జయంతి వేడుకలు

వార్త 6లో..

ఢిల్లీలో పేలుడుతో అలెర్ట్..

విశాఖలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన పేలుడు ఘటనతో విశాఖపట్నం నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించడానికి నగర పోలీసులు ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో విశాఖలో భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో సోమవారం రాత్రి నగర వ్యాప్తంగా అన్ని ప్రధాన కేంద్రాలు, రద్దీ ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో భద్రతను గణనీయంగా పెంచారు. ప్రయాణికుల లగేజీతో సహా అనుమానాస్పద వస్తువులను మెటల్ డిటెక్టర్లు బాంబు/డాగ్ స్క్వాడ్ బృందాల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నగర సరిహద్దులు, ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు వాహనాల వివరాలను పరిశీలించారు.

లాడ్జీలు, కొరియర్ కార్యాలయాలపై నిఘా

భద్రతా చర్యలలో భాగంగా, లాడ్జీలు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కొత్తగా బస చేస్తున్న వారి గుర్తింపు కార్డులు, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్గో సర్వీస్ సెంటర్లు కొరియర్ కార్యాలయాలలో పార్శిళ్ల వివరాలను నమోదు చేసుకొని, నిఘా పెట్టారు. నగర ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, సంఘటనలు ఏవైనా దృష్టికి వస్తే, తక్షణమే డయల్ 112 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

సినర్జీస్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలి

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్

సినర్జీస్ కార్మికుల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దువ్వాడ విఎస్‌ఇజెడ్‌లోని సినర్జీస్ కంపెనీలో పనిచేస్తున్న 600 మంది కార్మికులకు యాజమాన్యం బకాయిపడ్డ ఆరు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ డిమాండ్ చేశారు. బకాయి పడ్డ జీతాలను చెల్లించాలని కోరుతూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కుటుంబాలతో సహా ధర్నా నిర్వహించారు. బకాయి జీతాలు చెల్లించాలని, బోనస్ ఇవ్వాలని, పిఎఫ్ ఇఎస్‌ఐ సక్రమంగా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు చట్టపరంగా రావలసిన హక్కుల్ని యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్‌ఐ కార్మికుల నుంచి రికవరీ చేస్తున్నా యాజమాన్యం వాటా చెల్లించడం లేదని తెలిపారు. 9 సంవత్సరాలుగా బోనస్ కూడా చెల్లించలేదన్నారు. కంపెనీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తున్న కార్మికులకు ఐదున్నర నెలలుగా జీతాలు కూడా చెల్లించడం లేదని వాపోయారు. ప్రతినెలా జీతాలు వచ్చినా కుటుంబాన్ని పోషించుకోలేని ఈ రోజుల్లో 5 నెలలు పైబడి పెండింగ్‌లో ఉంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసు వద్ద సమావేశంలో జీతాలు చెల్లిస్తామని అంగీకరించి, తర్వాత చెల్లించ లేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకున్నా యాజమాన్యం జీతాలు చెల్లించ లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక సమ్మిట్‌లు నిర్వహించి కంపెనీలు వస్తాయంటున్నారని, ఉన్న కంపెనీల్లో కార్మికులకు జీతాలు ఇచ్చేలా చూడాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సినర్జీస్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలి

ఎత్తున పోరాడతామని హెచ్చరించారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి దాస్ మాట్లాడుతూ, జీతాలు చెల్లించకపోతే తామెలా పనిచేయగలమని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యూటీలకు రావడానికి కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పిల్లల చదువులు కూడా మధ్యలోనే ఆగిపోయాయని, అందుకే భార్యాపిల్లలతో కలిసి నిరసన చేపట్టామని తెలిపారు. జీతాలు చెల్లించకపోతే తామ ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ, కంపెనీలో 20 సంవత్సరాల పైబడి పని చేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఈ పోరాటానికి గాజువాక సిఐటియు నాయకులు లోకేష్, రాజు, ఐద్వా నాయకులు లక్ష్మి, కామేశ్వరి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

12న విశాఖకు ఉండవల్లి శ్రీదేవి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ఉత్తరాంధ్రలో పర్యటనలో భాగంగా బుధవారం విశాఖపట్నం వస్తున్నారని మాదిగ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం విమానంలో నగరానికి చేరుకుంటారని, బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

శివ ప్రకాష్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: నగరంలో పురాతన నాణెములు, స్టాంపులు సేకరణలో గత కొన్నాళ్లుగా విశేషంగా కృషి చేస్తున్న 15వ వార్డు జెఆర్.నగర్‌కు చెందిన జిఎస్ శివప్రకాష్‌కు జాతీయస్థాయి అవార్డు లభించింది. సోమవారం బీచ్ రోడ్డులోని సాయిప్రియ రిసార్ట్స్‌లో సామాజిక సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును శివ ప్రకాష్‌కు అందజేశారు. పురాతన వస్తుసేకరణకర్త, విశ్రాంత సహకార బ్యాంకు ఉద్యోగి శివప్రకాష్‌కు అవార్డు ఇవ్వడం తమకు ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. విజయనగరం కేంద్రంగా గల సామాజిక సేవా సంస్థ డైరెక్టర్, కమిటీ సభ్యులు శివప్రకాష్ సేవలను గుర్తించి పూరి జగన్నాథస్వామి దైతపతి భవిణ్ దాస్ మహారాజావారి చేతులమీదుగా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ డాక్టర్ అన్నపూర్ణ శతవతి, కవి, రచయిత డిజిఎన్.శంకరరావు, కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాకవి అందెశ్రీకి నివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన హమ్మీ భవనంలో ప్రజాకవి అందెశ్రీ మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ సోమవారం నివాళులర్పించారు. ముందుగా అందెశ్రీ చిత్రపటానికి ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు, రచయిత మౌలాలి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.చంటి, అధ్యక్షులు జి.రమణ, సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఒ.విజయ, జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వి రమణ, ఎం.నాగేశ్వరరావు, గౌరి తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

12, 17న ఐక్యతా యాత్రలు

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: భారత తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విశాఖలో రెండు 'ఐక్యత యాత్రలు' నిర్వహించనున్నట్లు విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ తెలిపారు. ఈ ఐక్యత యాత్రలను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ మై భారత్ (నెహ్రూ యువ కేంద్రం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. లాసన్స్ బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీభరత్ మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీ ఉదయం మొదటియాత్ర ఆర్‌కె.బీచ్‌లోని శ్రీ కాళీమాత ఆలయం నుండి యూత్‌హాస్టల్స్ వరకూ కొనసాగుతుందని, రెండో యాత్ర ఈనెల 17వ తేదీన పాతగాజువాక నుండి కొత్తగాజువాక వరకు ఉంటుందని తెలిపారు. నెల రోజులపాటు ఐక్యతా మార్చ్ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడల్లో విశాఖ జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అనంతపురం ఆర్‌డిటి మైదానంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విశాఖపట్టణం జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించింది. 3 రోజులపాటు సాగిన ఈ క్రీడా పోటీలలో విఆర్‌ఎ, విఆర్‌ఒ, ఆఫీస్ సబార్డినేట్ నుండి డిప్యూటీ కలెక్టర్ల వరకు వివిధ హోదాల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

పురుషుల విభాగం 100 మీటర్ల పందెంలో జూనియర్ అసిస్టెంట్ రవివర్మ ప్రథమ స్థానం, 400 మీటర్ల రిలే పందెంలో జట్టు తృతీయ స్థానం, బ్యాడ్మింటన్ డబుల్స్ (పురుషులు) విభాగంలో టి.ఉదయ్, ఎస్.రోహిత్ జట్టు ప్రథమ స్థానం, బ్యాడ్మింటన్ సింగిల్స్ (పురుషులు) విభాగంలో ప్రథమ స్థానం సాధించాయి. మహిళల విభాగంలో బ్యాడ్మింటన్ డబుల్స్ (మహిళలు) విభాగంలో ఎస్.సిరి, డి.శ్రావణి ద్వితీయ స్థానం సాధించారు. షాట్‌పుట్ కేటగిరీలో ఇ.ప్రసన్న ప్రథమ స్థానం, చెస్ కేటగిరీలో పి.పద్మలత, డిప్యూటీ తహశీల్దార్ ద్వితీయ స్థానం, టగ్ ఆఫ్ వార్ కేటగిరీలో మహిళా జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. జిల్లా క్రీడాకారుల సమష్టి కృషి, క్రీడాస్ఫూర్తి ఫలితంగా విశాఖపట్టణం జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో రెండో స్థానం సాధించినట్లు రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర క్రీడా కార్యదర్శి రాజేంద్రవర్మ, జిల్లా అధ్యక్షులు ఎస్ఎ.త్రినాథరావు, జిల్లా కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ స్థానిక మీడియాకు తెలిపారు. ఈ పోటీలలో కలెక్టరేట్ ఆఫీస్ సూపరింటెండెంట్‌లు, అసిస్టెంట్ అధికారులు, ఇతర సిబ్బంది కూడా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

'స్నేహ సంధ్యా ఏజ్ కేర్'కు కెవిబి సహకారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వృద్ధులు, అంతిమ దశలో ఉన్న రోగులకు సంరక్షణ అందించే విశాఖపట్నంలోని లాభాపేక్ష లేని స్నేహ సంధ్యా ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు కరూర్ వైశ్యా బ్యాంక్ (కెవిబి) తన కార్పొరేట్ సామాజిక బాధ్యత మద్దతును అందించింది. ఈ సహకారం ద్వారా, విశాఖపట్నంలోని ఇంటిగ్రేటెడ్ పాలియేటివ్ అండ్ జెరియాట్రిక్ కేర్ సర్వీసెస్ ఫెసిలిటీలోని మొత్తం ఇన్‌పేషెంట్ విభాగం, లెవల్-1, సి-బ్లాక్ నిర్మాణం సదుపాయాల అభివృద్ధి సాధ్యమైంది. ఈ సిఎస్ఆర్ మద్దతుతో, బ్లాక్-సి విభాగంలో 16 ఇన్‌పేషెంట్ గదులు రెండు నర్సింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ కొత్త సౌకర్యం ద్వారా వృద్ధాప్య సంరక్షణ, పాలియేటివ్ కేర్, రెస్పిటేట్ కేర్, డిమెంటియా రెసిడెన్షియల్ కేర్ వంటి అనేక సేవలను అందించనున్నారు.

ఈ సందర్భంగా కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ రమేష్‌బాబు, మాట్లాడుతూ, ముఖ్యంగా వృద్ధులు, బలహీనుల కోసం, సమాజ అభివృద్ధి, సమగ్ర ఆరోగ్య సంరక్షణ పట్ల కెవిబి తన భాగస్వామ్యం కల్పించిందని వివరించారు. స్నేహ సంధ్యా ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎన్ఎస్. రాజు, మాట్లాడుతూ కెవిబి మద్దతు తమ దృష్టిని వాస్తవికతగా మార్చడంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో 2024-2025 విద్యా సంవత్సరాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రైల్వే ఉద్యోగుల పిల్లలకు సోమవారం ఉపకార వేతనాలు (స్కాలర్‌షిప్‌లు) అందజేసి సన్మానించారు. పోర్ట్ స్టేడియం, సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (వాల్తేరు) అధ్యక్షులు జ్యోత్స్న బోహ్రా అధ్యక్షత వహించారు. ఈ వేడుకలో మొత్తం 340 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు, ఐఐటి, మెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఉన్నారు. ఈ వేడుకకు ఉపాధ్యక్షులు గాయత్రి సంతారామ్, కార్యదర్శి అంకితా శర్మ ఇతర కార్యనిర్వాహక సభ్యులు, బ్రాంచ్ అధికారులు, ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ సభ్యులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు రూ.125 కోట్ల ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: రాష్ట్రంలో ఐటి (సమాచార సాంకేతికత) ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ రంగాల ప్రోత్సాహకాల్లో భాగంగా రూ.125 కోట్లకు పైగా విలువైన ప్రోత్సాహకాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. దీనిలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న (వివిధ సెట్‌లకు చెందిన) ప్రోత్సాహకాల్లో ఇది మొదటి విడతగా 50 శాతం మొత్తాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ పరిశ్రమ (ఎపిడిటిఐ) నెట్ వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు హర్షం వ్యక్తం చేశారు.

ఎయు బ్యాక్‌లాగ్ నియామకాల అక్రమాలపై విచారణ జరపాలి : సిపిఐ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఎయు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై యూనివర్సిటీ ఉపకులపతి స్పందించి విచారణ జరపాలని సిపిఐ విశాఖపట్నం జిల్లా సమితి డిమాండు చేసింది. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిఎన్ క్షేత్రపాల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విశ్వవిద్యాలయంలో అక్రమాలకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకాల విషయంలో అంత గోప్యత ఎందుకని ప్రశ్నించారు. నియామకాల విషయంలో ఉన్నతాధికారులు తీరు అనుమానం కలిగించే విధంగా ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ వివరాలు, పోస్టుల సంఖ్య, దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, మెరిట్ లిస్టును తక్షణమే బహిరంగ పరచాలని డిమాండ్‌చేశారు. ఈ వ్యవహారంలో యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఉన్నత విద్యామండలి దృష్టి సారించి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A. 234/2023 in O.S. 96/2017

Between:
Smt. Dasu Nookaratnam ...Petitioner/Plaintiff
And
Smt. B. Nookaratnam & others ...Respondents/Defendants

NOTICE

To,
R-18: Sri Bavirisetti Appala Narasayya Gupta, S/o. late Veera Raju, R/at Raja Veedhi, Adivivaram, Simhachalam, Visakhapatnam.

పైనెంబరు దావాలో 11వ ప్రతివాదిగారైన బవిరిశెట్టి వీర్రాజు, S/o. లేటు అప్పల నరసయ్య చనిపోయినందున వారి తాలూకా వారసునిగా మిమ్ములను చేర్చమని పై నెంబరు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌నందు కోర్టు ద్వారా పంపిన నోటీసులు అందుకొనని కారణంగా ఈపేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది.28-11-2025**న వాయిదా అయి వున్నది. ఆదినమున మీరు **ఉ॥గం॥ 10.30ని॥**లకు స్వయంగాగానీ, వకీలు గారి ద్వారాగాని పై తెలిపిన కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పైపిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీకోర్టువారు మీపరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)
K. RAMA KIREETI & D. KETAN
Advocates
Visakhapatnam. **Cell: 8500881555**

రెస్పాండెంట్స్‌కి తెలియజేయు నోటీసు
[SCR, ఆర్డర్ XXII]
భారత దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు)
ఫౌజదారీ అపీల్య ప్రతిపాద్యత
స్పెషల్ లీవ్ పిటిషన్ (సివిల్) పిటిషన్ సంఖ్య 20488 ఆఫ్ 2024తో పాటు
I.A. నెం. 200639/2024 - అపిల్ చేసిన తీర్పు (IMPUGNED JUDGMENT) యొక్క శ్రేణి/ప్రతుల (C/C) ఫైలింగ్ నుండి మినహాయింపు కోసం దరఖాస్తు

బయ్యవరపు రమేష్ మరియు ఇతరులు ...పిటిషనర్లు
Versus
అవాలా విజయలక్ష్మి మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు

టు:
1. రవిప్రోలు జయలక్ష్మి @ జయలక్ష్మిరావు, W/o.పాండురంగారావు విరమించిన ఉద్యోగి, నివాసం: D.No. 10-50-81/1, వాల్తేర్ అప్‌ల్యాండ్స్, దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టు ఎదురుగా, రాక్‌డేల్ లే-అవుట్, రామ్ నగర్, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
PID: 257939/2025 FOR R[2] IN SLP(C) No.20488/2024 (SEC XII-A)
2. మైలవరపు సత్యవతి, W/o. లేట్ రాధాకృష్ణ, D.No. 10-50-81/1, వాల్తేర్ అప్‌ల్యాండ్స్, దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టు ఎదురుగా, రాక్‌డేల్ లే-అవుట్, రామ్ నగర్, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
PID: 257940/2025 FOR R[3] IN SLP(C) NO.20488/2024 (SEC XII-A)

ఈ పిటిషన్ (స్పెషల్ లీవ్ పిటిషన్ (సివిల్)) పై కల్పిత కాపీ రిజిస్ట్రికి శ్రీ విపిన్ నాయిర్, అడ్వకేట్ ఆన్-రికార్డ్ వారిచే నమోదు చేయబడినది. పిటీషనర్లు పేరుపెట్టిన వారు తరఫున ఇది కోర్ట్ ముందు వినిపించబడటానికి 13 సెప్టెంబర్ 2024న విచారణకి లిస్ట్ చేయబడింది మరియు కోర్ట్ దిగువ పేర్కొన్న ఆర్డర్ విడుదల చేసింది:

1. పిటీషనర్ల తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్న వారి మెళుకువైన సీనియర్ కౌన్సిల్ సమక్షంలో పిటిషనర్లు పెట్టిన పత్రాలు పరిశీలించబడినవి.
2. నోటీస్ జారీచేయబడినవి, నాలుగు వారాల తర్వాత రిటర్నబుల్‌గా.
3. దస్తి సేవ (Dasti service) కూడా అనుమతించబడినది.
4. ఈమధ్యకాలంలో వివాదాస్పద నిర్వహణ (execution) చర్యలు నిలిపివేయబడినవి.

అదే సమయంలో, షోకాజ్ నోటీసు సేవ చేయటం యధావిధిగా పూర్తి కాలేదని, అన్‌సర్వ్ అయిన రెస్పాండెంట్స్ 2, 3 పైప్రత్యామ్నాయ సేవ (Substituted Service) కోసం దరఖాస్తు అంశం హానరబుల్ కోర్ట్ (ఇన్-చాంబర్స్) ముందు 27 అక్టోబర్, 2025న లిస్ట్‌చేసి, దిగువతో సమాన ఆర్డర్ జారీ చేయబడింది.

"ఆఫీస్ రిపోర్టు ప్రకారం, రెస్పాండెంట్స్ 2 మరియు 3 పై నోటీసులు ఇప్పటివరకు పంపబడలేకున్నాయి. అప్లికెంట్స్‌తరఫున IA No. 216578/2025 దాఖలుచేయబడింది. అన్‌సర్వ్ అయిన రెస్పాండెంట్లపై ప్రత్యామ్నాయ సేవచేయమన్న లబ్దిని కోరుతూ. IA No. 216578/2025 అనుమతించబడును. ప్రచురణ యొక్క సాక్ష్యాన్ని రికార్డ్ చేయించాల్సినట్లు."

ఇదే కారణంగా (Now, Therefore, Take Notice). పై కేసు కోర్ట్ ముందు సరైన కోర్సు ప్రకారం పోస్ట్ చేయబడనుంది. మీరు అందువల్ల ఈ కోర్టు ముందు వ్యక్తిగతంగానో లేక ఈ కోర్టులో నియమించబడిన అడ్వకేట్-ఆన్-రికార్డ్ ద్వారా ప్రతినిధిగా విచారణకు హాజరు కావలసినది. సూచనల ప్రకారం, ఈనోటీసు స్వీకరణ తేదీ నుంచి ముప్పై (30) రోజులలోపు హాజరు కాగలరు. ఆరోజు లేదా తరువాత ఒక తేదీని కోర్ట్ నిర్ణయిస్తే మీరు ప్రత్యేక లీవ్ మరియు తాత్కాలిక ఉపశమనం (Interim Relief) కోరినట్లు ఎందుకు అనుమతించకూడదో చెబుతూ షో-కాజ్ చేయవలెను. మీ ప్రతివాదంలో (Affidavit in Opposition) Order XXII, SCR 2013 యొక్క Rule VI ప్రకారం మీవైపున ఉన్న నిరాకరణ (Grounds in Opposition) తెలిపిన స్పష్టమైన కారణాలు సెట్ చేస్తూ, పిటిషన్-పై ఉన్న చట్టపరమైన ప్రశ్నలకును లేదా ప్రత్యేక లీవ్ పిటిషన్ (సివిల్) లో ఉల్లంఘించిన ఆధారాలకు జవాబుఇస్తూ, కోర్టులో ముందున్న ఇతర Pleadings మరియు పత్రాలను సమర్పించవచ్చు. అలాగే, Special Leave Petition (Civil) పై ఇచ్చిన ఆర్డర్‌ను ఎవరికి వ్యతిరేకంగా దాఖలు చేయబడిందో తెలిపారు. మధ్యంతర (Interim) ఆర్డర్ అప్పటికే ఇచ్చిఉంటే దానిని రద్దుచేయమని లేదా ముందస్తు ఆర్డర్ ఇవ్వకూడదని గమనించిన కారణాలు కూడా పేర్కొనాలి.

గమనిక: మీరు నిర్దేశించిన విధంగా హాజరుకాకపోతే, ప్రత్యేక లీవ్ ఇచ్చిన తర్వాత కూడా మీకు అదనపు నోటీసు ఇవ్వబడదని, మరియు మీ అనుమతితో పై అంశం నిపుణులా తీర్చబడతుందని తెలియజేయబడుతుంది.

తేదీ: 30 అక్టోబర్, 2025 Sd/- అసిస్టెంట్ రిజిస్ట్రార్

పంపిణీ చేయబడనది:
1. మిస్టర్ **విపిన్ నాయిర్** (అడ్వకేట్) 39, లాయర్స్ ఛాంబర్స్, ఆర్.కె. గార్గ్ బ్లాక్ సుప్రీమ్‌కోర్ట్, న్యూఢిల్లీ.
2. మిస్టర్ **టి.ఆర్.బి. శివకుమార్** (అడ్వకేట్) 31,లాయర్స్ ఛాంబర్స్, సుప్రీంకోర్ట్ కాంపౌండ్,న్యూఢిల్లీ-110001

గమనిక: Sd/- అసిస్టెంట్ రిజిస్ట్రార్

1. లీగల్ సేవ: ఒక అడ్వకేట్ ద్వారా చట్ట సహాయం Supreme Court Legal Services Committee & Supreme Court Middle Income Group Legal Aid Society ద్వారా అర్హులైనవారికి అందజేయబడుతుంది

మరింత సమాచారం కోసం మీరు Supreme Court Legal Services Committee లు లేదా Supreme Court Middle Income Group Legal Aid Society సెక్రెటరి/మెంబర్ సెక్రెటరీని సంప్రదించవచ్చు: చిరునామా: 107-108, లాయర్స్ ఛాంబర్స్, ఆర్.కె. జైన్ బ్లాక్, పోస్టాఫీస్ దగ్గర, సుప్రీంకోర్ట్ కాంపౌండ్, తిలక్‌మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోన్: 011-23116353, 23116354 (అడిషనల్ బిల్డింగ్ కాంప్లెక్స్) మరియు 011-23381257 (ఫ్రంట్ ఆఫీస్).

2. మీడియేషన్: సుప్రీంకోర్ట్‌లో విచారిస్తున్న కేసులలో తగిన శిక్షణ పొందిన మిడియేటర్ల ద్వారా వివాదాల సమాధానం (amicable settlement) సాధించే సదుపాయం అందుబాటులో ఉంది.

మరింత సమాచారం కోసం సంప్రదించండి: కో ఆర్డినేటర్, సుప్రీంకోర్ట్ మీడియేషన్ సెంటర్, 109, లాయర్స్ ఛాంబర్స్, ఆర్.కె. జైన్ బ్లాక్, పోస్టాఫీస్ దగ్గర, సుప్రీంకోర్ట్ కాంపౌండ్, తిలక్ మార్గ్, న్యూఢిల్లీ-110001. (టెలిఫోన్ నెం.011-2307432).

ఆరు నెలల్లో చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ ప్రాంతానికి ల్యాండ్ మార్క్ అయ్యేలా చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జిని అధునాతనమైన డిజైన్‌తో నిర్మించి.. ఆర్నెల్లలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రూ. 3.23 కోట్లతో ప్రతిపాదించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చంద్రంపాలెం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మధురవాడ ప్రజల చిరకాల వాంఛన్నారు. అయితే నేషనల్ హైవే, మెట్రో విభాగాల నుంచి అభ్యంతరాలతో ఈ బ్రిడ్జి నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన యాడ్ ఏజెన్సీలో వెనక్కు పోయాయన్నారు. మెట్రో ప్రాజెక్టు డిజైన్‌కు ఆటంకం ఏర్పడే అవకాశముందని అధికారులు అభ్యంతరం నేపథ్యంలో మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి అవసరాన్ని వివరించి డిజైన్ మార్పునకు ఒప్పించానన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన చంద్రంపాలెం పాఠశాలలోని నాలుగు వేల పైచిలుకు విద్యార్థులతోపాటు స్థానిక ప్రజలు ఇక్కడ రోడ్డు దాటేందుకు పడుతున్న ఇబ్బందులు నేపథ్యంలో త్వరలో దీన్ని సాకారం చేయనున్నట్లు వెల్లడించారు. చినుకురాలితే నీటికుంటలా మారిపోతున్న చంద్రంపాలెం ఉన్నత పాఠశాల క్రీడా మైదానం సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి డిజైన్లను ఎమ్మెల్యే గంటా పరిశీలించారు.

విశాఖకు మరిన్ని ప్రాజెక్టులు

ఈనెల 14, 15 తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల పరిశ్రమలకు ఒప్పందాలు జరగనున్నాయని, వాటిలో విశాఖ ప్రాజెక్టులు కూడా ఉన్నాయని గంటా వెల్లడించారు.. గూగుల్, టిసిఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్, సిఫీ, సత్వా వంటి అంతర్జాతీయ సంస్థలు రాకతో రాష్ట్రాభివృద్ధికి విశాఖ గ్రోత్ ఇంజన్ కానుందన్నారు. వచ్చే ఏడాది జులైకి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో రూ.175 కోట్లతో 7 మాస్టర్ ప్లాన్ రోడ్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఇఇ శాంతిరాజు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు, కె.అచ్యుతరావు, గరే గుర్నాథ్, మంగాదేవి, గాడు అప్పలనాయుడు, బోయి రమాదేవి, దొరబాబు, పోతిన ప్రసాద్, లొడగల జానకిరాం పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ముమ్మరంగా స్వచ్ఛత పనులు

స్వచ్ఛత పనుల్లో ఆదిత్య కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్లు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని చీమలపల్లి గ్రామంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల ప్రత్యేకశిబిరంలో భాగంగా మూడోరోజు సోమవారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళి మోహనరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలన్నారు. అలాగే పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల తొలగింపు వంటి స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు..చీమలపల్లి గ్రామ సభ్యులు ఎన్ని బాబు, ప్రకాష్ , కిషోర్ సంతోష్ సింహాచలం, శ్రీను,ఎర్రయ్య, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్తీక వనసమరాధన వారోత్సవంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో సోమవారం ఉసిరి, గోరింటాకు, బిల్వ పత్రంవంటి ఔషధ మొక్కలు నాటినటన్లు ప్రిన్సిపాల్ డాక్టర్.పి.శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, కార్తీక వనసమరాధన సంబరాలు ప్రజలకు, ప్రకృతికి మధ్య బలమైన సంబంధాన్ని పెంపొందిస్తాయని,ప్రకృతి పరిరక్షణ బాధ్యతను ప్రతిఒక్కరికీ గుర్తు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి, వాటిని సంరక్షించడం ద్వారా కళాశాల ప్రాంగణం పచ్చదనంతో నిండి మంచి ఆహ్లాదాన్ని కలిగిస్తుందన్నారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులు మొక్కలను నాటారు

పాలవలసలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - ఆనందపురం: ఎక్యూజే కళాశాల విద్యార్థుల దత్తత గ్రామం పాలవలసలో సోమవారం కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుధారాణి మాట్లాడుతూ వారం రోజులపాటు ఎన్‌సిసి క్యాడెట్లు గ్రామంలో పరిశుభ్రత, వృక్షారోపణ, గ్రామాభివృద్ధి, ఆరోగ్య అవగాహన వంటి పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనునా న్నమన్నారు. కార్యక్రమంలో పాలవలస వైస్ ప్రెసిడెంట్ నిమ్మల అప్పలరాజు, ఎంపియుపి స్కూల్ హెచ్‌ఎం సన్యాసిరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Public are hereby informed that my client Sri Nageswararao Kuna, S/o. Papa Rao, Resident of Flat No.401, Swetha Iris Apartment, Road No. 19, Shilpa Layout, Miyapur, Malkajgiri, Telangana is purchasing the below schedule property from Sri Nambala Rambabu, S/o. Late Adinarayana and Smt Namabala Bharathi, W/o.Nambala Rambabu, residing at D.No.39-19-55/1/10, Flat No.401, Venu Madhava Enclave, Madhavadhara, Visakhapatnam are the owners of the schedule property.

Hence if any member of the public got any interest, rights, claims over this property or objections over the proposed sale transaction they shall come forward within 10 days from this day in writing with supporting documents to the below addressee, failing which it shall be deemed that the above members are the absolute owners of the property and that the same is absolutely unencumbered and the transaction will be proceeded with.

SCHEDULE

Site of an extent of 433 Sq. yards, covered by survey No.210/8 of Madhurawada Village, Greater Visakhapatnam Municipal Corporation and bounded as follows:

East : 20 Feet Road
South : Land belongs to P.Ramu
West : Others Layout
North : Remaining land belongs to Vendors

M.KRISHNA
ADVOCATE D.NO.2-28,
RAJEEVNAGAR OLD DAIRY FARM POST
VISAKHAPATNAM-40
Cell : 9059578905, 9866129926

ఎంఎస్ఎంఇ బోర్డు డైరెక్టర్‌గా రాజారావు

ముగడ రాజారావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎపి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా తూర్పు నియోజకవర్గం 11వ వార్డు టిడిపి నాయకులు ముగడ రాజారావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆరిలోవ: తోటగరువు మురళీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. సంఘం నూతన అధ్యక్షునిగా మొల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి సన్యాసిరావు, గౌరవ అధ్యక్షులుగా చిన్నారావు, గౌరవ సలహాదారులుగా మొల్లి అప్పలనాయుడు, ఒమ్మి కృష్ణ, కోశాధికారిగా మొల్లి జగ్గారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మొల్లి చిన్నారావు, సహాయ కార్యదర్శులుగా ఒమ్మి రాంబాబు, మన్యాల వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా ఒమ్మి రామారావు, ఒమ్మి వెంకటకృష్ణ, సహాయ కోశాధికారిగా ఒమ్మి గోవిందు, సహా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పీతల వెంకటేష్ ఎన్నికయ్యారు.

18న పౌర గ్రంథాలయంలో సదస్సు

ప్రజాశక్తి-తగరపువలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులను చైతన్య పరచడానికి ఈనెల 18న నగరంలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సిపిఐ, ఎఐటియుసి సంయుక్తంగా ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సోమవారం జిఆర్ భవన్‌లో కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిర్వహించే ప్రాంతీయ సదస్సుల్లో కార్మికచట్టాలు రద్దు, కార్మికుల పనిగంటలు పెంపు, కనీసవేతనాలు అమలు, ఇతర అంశాలపై చర్చిస్తామన్నారు. సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కానూరు రాంబాబు, మోర అప్పలరాజు, రామ్ పైడి, సన్నిబాఉ, లక్ష్మణరావు అప్పారావు ముత్యాలరావు పాల్గొన్నారు

ఎన్‌సిసి కేడెట్లకు స్కూబా డైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల వివిధ జిల్లాల నుండి వచ్చిన 105 మంది ఎన్‌సిసి కేడెట్లుకు స్కూబా డైవింగ్ అడ్వెంచర్ కోర్స్ 2025లో శిక్షణ విజయవంతంగా సాగుతోంది. ఈనెల 3న ప్రారంభమై, 12 వరకు కోర్సు సర్జన్ కమాండర్, నేవల్ మెడికల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ ఎ.నరసింహారావు నాయకత్వంలో నగరంలోని ఎన్‌సిసి గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌లో 80 మంది బాలురు 25 మంది బాలికలకు శిక్షణ కొనసాగుతోంది కమాండ్ క్లియరెన్స్ డైవింగ్ టీమ్, ఆఫీసర్ ఇన్‌చార్జ్ ఒది.కమాండర్ గౌరవ్ మిశ్రా మార్గదర్శకత్వంలో, ఎన్‌సిసి కేడెట్లకు నేవీ డైవర్స్ ద్వారా స్కూబా డైవింగ్, స్నార్కెలింగ్, ఫిన్ స్విమ్మింగ్‌లో శిక్షణనిస్తున్నారు. కఠినమైన ఈ శిక్షణ ద్వారా ఎన్‌సిసి కేడెట్లకు ఐక్యత, క్రమశిక్షణ అవడడంతోపాటు సాహసస్ఫూర్తిని పెంపొంది, నిస్వార్థ సేవాభావం, స్నేహభావం వంటి ఆదర్శాలు వృద్ధి చెందనున్నాయి.

ఉత్సవాల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని కంచరపాలెం, ఇందిరానగర్-1 కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఈ నెల 26న సుబ్రమణ్య జన్మషష్టి నిర్వహించనున్నట్టు దేవాలయ గౌరవాధ్యక్షులు గొండు సీతారాం తెలిపారు. సోమవారం దేవాలయ ఆవరణలో కమిటీ సర్వసభ్య సమావేశంలో ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా 26న స్వామికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు, సాయంత్రం ఊంజల్‌సేవ, తర్వాత తిరువీధి రథోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. దేవాలయ అధ్యక్షులు బైరి చిరంజీవి మాట్లాడుతూ వార్డు ప్రజలు, దేవాలయ కమిటీ, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు వి.రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి.రంగారావు, సంయుక్త కార్యదర్శి మారుతి, హరీష్ కుమార్, సభ్యులు యశోద కుమార్, కె.నారాయణ రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- కొమ్మాది : స్థానిక చైతన్య విద్యాసంస్థలో సోమవారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. నియోవిజన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో వెయ్యి మందికి విద్యార్థులకు కంటిపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడటం వలన కంటికి కలిగే నష్టాలు, లైటింగ్‌లో పుస్తకం చదవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థుల ఒత్తిడి వలన తలనొప్పి రాకుండా తగిన జాగ్రత్తలు వివరించారు

నేరాలు ఘోరాలు

ఉరేసుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గాజువాక : ఉరేసుకొని వ్యక్తి మతి చెందిన ఘటన సాయిదుర్గ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. భీమిలికి చెందిన దున్న చంద్రమోహన్ (52) సాయిదుర్గ బార్ అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్ గా పనిచేస్తున్నారు. అయితే అతని పనితనం బాగోలేదని, తరచూ మద్యం తాగుతున్నాడని నెల రోజుల క్రితం తొలగించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో నైలాన్ తాడును మెడకు ఉరేసుకుని మృతి చెందారు. దీనిపై సిఐ పార్థసారథి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య

-అల్లుడే చంపేశాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపణ

ప్రజాశక్తి-గోపాలపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి రామకృష్ణ నగర్‌లో ఆదివారం రాత్రి దేసంశెట్టి విజయశ్యామల (25) అనే వివాహిత ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడింది. తమ కూతురిని అల్లుడే హత్య చేశాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అందిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తెలిపిన వివరాలివి.

2024 డిసెంబర్‌లో గోవాడకు చెందిన శివకుమార్‌కు అచ్యుతాపురం మండలానికి చెందిన విజయశ్యామలతో గతేడాది డిసెంబర్‌లో వివాహం జరిగింది. శివకుమార్ ప్రైవేటు ఉద్యోగరీత్యా వీరు ఆరునెలలుగా గోపాలపట్నంలో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌కు శివకుమార్ సమాచారం అందించాడు. సంఘటనాస్థలాన్ని ఎసిపి పృథ్వీతేజ్, సిఐ సన్యాసినాయుడుతోపాటు గోపాలపట్నం పోలీసులు చేరుకుని పరిశీలించారు. విజయ శ్యామలను ఆమె భర్త శివకుమార్ హత్యచేశాడని, తమకు న్యాయం చేయాలని మృతురాలి తల్లిదండ్రులు, సోదరుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మామే నా భర్తను చంపేశాడు'

- పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆరిలోవ : కన్న తండ్రే కొడుకును కొట్టి చంపేసాడని కోడలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివి. నగరంలోని విశాలాక్షినగర్, చలపతినగర్‌లో యెలుదుతి లక్ష్మణరావు(60) తన కుమారుడు ప్రసాద్(36) కోడలు రాజీ, మనవళ్ళతో నివాసం ఉంటున్నారు. కుమారుడు ప్రసాద్ మద్యానికి అలవాటు పడి నిత్యం తండ్రి, భార్య రాజీతో గొడవ పడుతుండేవాడు.

ఎప్పటి మాదిరిగానే ఈ నెల 6న డబ్బులు కావాలని ప్రసాద్ తన తండ్రి లక్ష్మణరావుతో గొడవ పెట్టుకున్నాడు. దీనితో విసిగి పోయిన లక్ష్మణరావు కుమారుడు ప్రసాద్‌ను కర్రతో గట్టిగా మూడు పర్యాయాలు కొట్టడంతో తలకు గాయం కావడంతో మృతి చెందాడు. దీనిని సహజ మరణంగా చిత్రీకరించి మరుసటి రోజు అనగా ఈ నెల 7న క్రిస్టియన్ సాంప్రదాయం ప్రకారం మృతదేహాన్ని పూడ్చిపెట్టేసారు. నాలుగు రోజుల తరువాత తన భర్తను మామే కొట్టి చంపేసాడని సోమవారం ఆరిలోవ పోలీసులకు కోడలు రాజీ ఫిర్యాదు చేసింది.. తహశీల్దారు సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి రీపోస్టుమార్టం చేసి, దర్యాప్తు చేయనున్నట్టు సిఐ మల్లేశ్వరరావు తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలో భూలోకమాంబ పంచరాత్రుల మహోత్సవాల్లో అక్టోబర్ 25 నాగులచవితి రాత్రి జరిగిన గోడవలో గాయపడి వ్యక్తి మృతి చెందిన నేపథ్యంలో నలుగురు నిందితులను యలమంచిలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ ధనుజయరావు తెలిపిన వివరాల ప్రకారం... నాగులచవితి రాత్రి జరిగిన ఈ గొడవలో నెట్టి శివ అనే వ్యక్తిని వెదుళ్ళ మోహన్, కసింకోట గురువులు, గున్నాబత్తుల విగ్నేష్, కొత్తూరు రవితేజ తదితరులు తోసివేయడం వలన వెనక్కి పడిపోవడంతో తలలో రక్తం గడ్డకట్టింది. చికిత్సలో భాగంగా కెజిహెచ్‌లో శివ తలకు ఆపరేషన్ చేశారు. అయినా పరిస్థితి విషమించి శివ ఆదివారం కెజిహెచ్‌లో చనిపోయారు. గొడవ జరిగిన తరువాత రోజు జాతరలో కొట్లాట కేసుగా నమోదు చేయగా, శివ చనిపోవడంతో ఆ కేసును బిఎన్ఎస్ 105 సెక్షన్‌గా మార్చి నలుగురు నిందితులను సోమవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సిఐ ధనుజయరావు తెలిపారు.

చిరస్మరణీయుడు తెన్నేటి

ఉక్కు కార్మిక సంఘాల నేతల ఘననివాళి

తెన్నేటి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం లో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు పోరాడిన యోధుడు తెన్నేటి విశ్వనాథం అనిఉక్కు కార్మిక సంఘాల నేతలు కొనియాడారు. సోమవారం ఉక్కు నగరం సెక్టార్ 9 తెన్నేటి పార్కులో తెన్నేటి విశ్వనాథం 46వ వర్ధంతి సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాల నేతలు తెన్నేటి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు తెన్నేటి కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఐఎన్‌టియుసిఅధ్యక్షులు పివి.రమణమూర్తి, హెచ్‌ఎంఎస్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు, నాయకులు టిఎస్ఎన్. పుల్లారావు పాల్గొన్నారు.

107 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపల్ సురేఖ, తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 107 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. కళాశాల జెకెసి, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్తాధ్వర్యం లో నిర్వహించిన జాబ్ మేళాలో 250 మంది నిరుద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. 15 కంపెనీల యాజమాన్య ప్రతినిధులు పాల్గొని,107మందిని ఎంపిక చేయగా, వారిలో కళాశాలకు చెందిన విద్యార్థులు 24 మంది ఉన్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారందరినీ ప్రిన్సిపల్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ విష్ణుమూర్తి, జెకెసి కోఆర్డినేటర్ డి.మాధురి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వై వెంకటరావు పాల్గొన్నారు.

వార్డు అధ్యక్షుడు బొడ్డేటి చొరవ

సొంత నిధులతో అండర్ పాత్‌వే మరమ్మతులు

మరమ్మతులను పరిశీలిస్తున్న విజయకుమార్

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు కొత్తపాలెం అండర్ పాత్‌వే వద్ద అధ్వాన పరిస్థితులపై కొత్తపాలెం పిఎసిఎస్ చైర్మెన్, వార్డు అధ్యక్షులు, బొడ్డేటి విజయ్ కుమార్ చొరవ చూపారు. ఇటీవల కురిసిన వర్షాలకు, నీరు నిలిచిపోయి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. అండర్‌పాత్‌వే వద్ద నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోయేలా ఏర్పాటు చేసిన ఐరన్‌గ్రిల్స్‌లో మట్టి, చెత్తాచెదారం పేరుకుపోవడం, గ్రిల్ పాడవ్వడం వల్ల నెలకొన్న ఇబ్బందులు నేపథ్యంలో, విజయకుమార్ తన సొంత నిధులతో గ్రిల్‌కు వెల్లింగ్, కిందన పేరుకుపోయిన మట్టి, వ్యర్థాల తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మందకొడి పనులపై మేయర్ ఆగ్రహం

ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణం పరిశీలిస్తున్న మేయర్

ప్రజాశక్తి- సీతమ్మధార : స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రూ.పది కోట్లతో చేస్తున్న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పనులు మందకొడిగా సాగుతున్నాయని, ఇంకా గదులు పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. త్వరలో స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పనులపై అధికారులతో సమీక్షిస్తామని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో జివిఎంసి స్పోర్ట్స్ డైరెక్టర్ ఇఎ. రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు గంగాధరరావు పాల్గొన్నారు

17న విద్రోహ దినం జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ములగాడ : పెన్షనర్లకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 17న పిఎఫ్ కార్యాలయం వద్ద నిర్వహించే విద్రోహదినాన్ని జయప్రదం చేయాలని ఆల్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె హుస్సేన్ పిలుపునిచ్చారు. సోమవారం కె. నూకరాజు అధ్యక్షతన మల్కాపురం సిఐటియు ఆఫీసులో ఎపిఆర్‌టిఎ సంఘ పారిశ్రామిక ప్రాంత ప్రాంతీయ సమావేశంలో మాట్లాడుతూ, వచ్చేనెల 17న పెన్షనర్స్ డే నిర్వహించి, సీనియర్లను సన్మానించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చేనెల 9 ,10 తేదీలలో ఢిల్లీ ఆందోళనకు జిల్లా నుంచి 40మంది సభ్యులు వెళ్లేందుకు రైల్వే రిజర్వేషన్లు చేయించుకున్నారని వారికి ఒకవైపు ఛార్జీల భారాన్ని యూనియన్ భరిస్తుందన్నారు. ఢిల్లీ ఆందోళనకు మద్దతుగా వచ్చేనెల 9న సదస్సు, 10న ర్యాలీ నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించిందన్నారు. షిప్‌యార్డుకు మినీరత్న హోదా వచ్చిన నేపథ్యంలో వేతన సవరణ సమయంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం విశ్రాంత ఉద్యోగులందరికీ వైద్యసదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్, గుర్తు చేస్తూ లేఖ రాసినట్లు తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు వెంకటాపురంలో నలుగురికి రూ.1,30, 710 విలువైన చెక్‌లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందజేశారు. పొట్నూరు కావ్యకు రూ.51,310, సత్యవరపు సూర్యారావుకు రూ.30,400, ఎల్లపు గణేష్‌కు రూ.30వేలు, కొండవలస హైమంజికి రూ.19వేలు, అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి రమేష్ నాయుడు, కంపర ఆనంద్, లత, గొంతిన శ్రీను, అప్పలరాజు, రఘు, హేమంత్, తతబాబు, బాబు, రాజు, భాస్కర్ రాజు, వెంకటరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

గోపాలపట్నం : జివిఎంసి 90వ వార్డు విమాననగర్, ఎన్‌ఎడి కొత్తరోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన సామాజిక భవనం మొదటి అంతస్తును ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

12న దుకాణాల బహిరంగ వేలం

ప్రజాశక్తి- భీమునిపట్నం: స్థానిక పెద్దబజారు వద్ద జివిఎంసి నిధులతో నిర్మించిన వాణిజ్య సముదాయంలో 11 దుకాణాలను మూడేళ్ల కాలానికి లీజుకు ఇచ్చేందుకు ఈనెల ఈ నెల 12న జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జెడ్‌సి ఒమ్మి అయ్యప్పనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి గెజిట్ నోటిఫికేషన్‌లోని నియమ నిబంధనల ప్రకారం వేలంంలో దక్కించుకునేందుకు ఆసక్తి ఉన్నవారు రూ.48వేలను జివిఎంసి కమిషనర్ పేరిట డిడి చెల్లించి పాల్గొనవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్, పాన్ కార్డు జెరాక్స్‌లతో కార్యాలయ పని వేళల్లో సంబంధిత విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎంవిఎస్.చలం తెలిపారు. దళారులు, మధ్యవర్తులు మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తోందన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాలకు రూ.2389, కామన్ రకం ధాన్యం క్వింటా రూ.2369లకు మరోవారం రోజుల్లో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తారని, రైతులు తొందరపడి తక్కువ ధరకు ధాన్యం అమ్మకాలు చేయొద్దని సూచించారు

ముడసర్లోవ పార్కు పరిశీలన

పార్కు పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ సునీత

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ పార్కును జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మీ, వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, ఇఇ కాంతిరాజు, డిఇఇ వెంకటరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. పార్కులో సమస్యలను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్‌సి మాట్లాడుతూ పార్కులో మూలన పడ్డ ఆటవస్తువులను మరమ్మతులు చేయిస్తామని, తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సహకారంతో నీటి గ్యాలరీని, పార్కును అభివృద్ధి చేస్తామన్నారు.

అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులు వేగవంతం

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) సోమవారం పరిశీలించారు. కేబుల్ లైన్ గోతులతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు వార్డు అధ్యక్షులు విజయరామరాజు, రాజన్‌రాజు, పావాడా రమణమూర్తి, కాంగ్రేగుల శ్రీనివాస నాయుడు, డివి.సూరిబాబు, బొడ్డా సన్యాసి, గండేపల్లి రాము, కోరుకొండ కల్యాణచక్రవర్తి, సుందర్ సునీల్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో జ్యోత్స్న ప్రతిభ

జ్యోత్స్నను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

ప్రజాశక్తి-తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీల్లో చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఎ.జ్యోత్స్న గ్రూప్ చెస్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి అచ్యుతరావు, బి.అప్పలరాజు తెలిపారు. ఈనెల 7,8,9 తేదీల్లో పార్వతీ పురం జోగంపేట పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిందన్నారు. చెస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థిని జ్యోత్స్నను హెచ్‌ఎం డి. ఆదినారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ పి..చిట్టిబాబు, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.

తైక్వాండో పోటీల్లో సంస్కృతి విద్యార్థుల సత్తా

రాష్ట్రపోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి-పద్మనాభం : తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో మండలంలోని కొవ్వాడ సంస్కృతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సత్తాచాటారు. అనకాపల్లి ఎఎంఎఎల్ కాలేజీలో నిర్వహించిన పోటీల్లో ఐదుగురు విద్యార్థులు స్వర్ణం, ఐదుగురు రజతం, మరో ఇద్దరు కాంస్య పతకాలను సాధించి అద్భుత ప్రతిభను కనబరిచారు. వీరంతా ఈ నెల 14,15 తేదీలలో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు తమ పాఠశాల నుంచి కె. లిఖిత, యస్ లోషిక, ఆర్ రిషిత, బి.మనోజ్‌సాయి, కె.యశ్వంత్ ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న వెంకటరావు, సర్పంచ్ లక్ష్మి

ప్రజాశక్తి - ఆనందపురం: మండల కేంద్రంలోని బేడా బుడగ జంగాలకాలనీ నూకాలమ్మ ఆలయం సమీపంలోనూ, అలాగే జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల వద్ద ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక నిధులు చెరో రూ.2లక్షలతో రెండు బోరు నిర్మాణ పనులకు వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ గ్రామ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరానికి బోరు ఏర్పాటు చేశామని, గ్రామాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు చందక సూరిబాబు, వైస్ సర్పంచ్ రమణమ్మ, పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు, సత్యమూర్తి, షిణగం చినరామారావు, చందక అప్పలస్వామి, మేడిశెట్టి రాంజీ, ఎడ్ల అప్పలనాయుడు, లంక ముత్యాలమ్మ, ఉపాధ్యాయులు భాస్కరరావు, శంకరరావు, త్రినాథ్, ముత్యాలనాయుడు, సునీత, శ్రీ విద్య, పూర్వ విద్యార్థి ఇల్లాపు వెంకటరావు (జగన్) పాల్గొన్నారు.

సామాన్యుడిపై ధరల పిడుగు

- రెట్టింపు అయిన కూరగాయల రేట్లు
- కార్తీకమాసం పేరుతో వ్యాపారుల సిండికేట్
- కానరాని నియంత్రణ, అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

కార్తీకమాసం ప్రభావం సామాన్యుడుపై పడింది. మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దాదాపు ప్రతి కూరగాయల ధరలు రెట్టింపు అయింది. దీంతో సామాన్యులు కొనుక్కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి సామాన్యుడి నెత్తిపై టోపీ పెడుతున్నారు. సాధారణంగా పక్షం రోజుల క్రితం 20 నుండి 30 రూపాయల కిలో ఉన్న కూరగాయలు ఇప్పుడు 80 నుంచి 100 రూపాయలకు చేరాయి. కొన్ని కూరలు మాత్రం డబుల్ రేటుకే అమ్ముడవుతున్నాయి. ధరలు వింటుంటే వినియోగదారులు షాక్ అవుతున్నారు.

మార్కెట్‌లో కిలో బీరకాయ రూ.70, బెండకాయ రూ.80 పలుకుతుంది. పక్షం క్రితం రూ .40 ఉండేది. వంకాయలు రూ.30 నుంచి ఏకంగా రూ.100కు చేరింది. క్యాబేజ్ 50 నుంచి రూ.80కి వెళ్లింది. గోంగూర రూ.100 వరకు అమ్ముడవుతోంది. ఇలా అన్ని ధరలు ఆకాశానికి చేరాయి. ధరల నియంత్రణ లేక మార్కెట్లో ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ మాసంలో పూజలు, వ్రతాలు ఎక్కువగా ఉండటంతో కూరగాయల వినియోగం పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే వాతావరణ మార్పులు, పంటల కొరత, రవాణా ఖర్చులు కూడా ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ కమిటీ అధికారులు అంటున్నారు.

కుదేలవుతున్న సామాన్యుడు

రోజూ కూరలు కొనడం ఇప్పుడు ఓ భారం అయింది. కుటుంబాలు ఒకరోజు వండితే రెండు రోజులు తినాలి అనే పరిస్థితి. చిన్న మధ్యతరగతి కుటుంబాల జీవనం కుదేలవుతుంది. ధరలు నియంత్రణలోకి రావాలంటే ప్రభుత్వం జోక్యం అవసరమని వినియోగదారులు కోరుతున్నారు. ధరల నియంత్రణ కోసం ప్రత్యేక మార్కెట్ డ్రైవ్ చేయాలని స్థానిక వినియోగదారులు కోరుతున్నారు.

ధరలు విపరీతంగా పెరిగాయి

మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగాయి. దాదాపు రెట్టింపు అయ్యాయి. కొనుక్కు తినలేని పరిస్థితి. వచ్చే ఆదాయానికి అనుగుణంగా లేకుండా ధరలు ఉన్నాయి.

- కె.అప్పారావు, అనకాపల్లి

అధికారుల నియంత్రణ లేకనే..

కార్తీక మాసం పేరుతో సిండికేట్‌గా మారి అక్రమంగా ధరలు పెంచేశారు. మాలాంటి సామాన్యులకు చాలా ఇబ్బందిగా మారింది. అధికారుల నియంత్రణ ఎక్కడా కనిపించలేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

- భాగ్యశ్రీ, గృహిణి, అనకాపల్లి

మాట్లాడుతున్న విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు

విద్యుత్ రంగ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-వడ్డాది : కేంద్ర ప్రభుత్వం విద్యుత్ (సవరణ) 2025 బిల్లును తీసుకువచ్చి డిస్కంలను ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నిస్తుందని, దానిని తీవ్రంగా వ్యతిరేకించాలని ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం వడ్డాది సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటివరకు వ్యవసాయం, చిన్న పరిశ్రమలకు, ప్రజలకు విద్యుత్ అతితక్కువ ధరకు అందిస్తూ దేశ అభివృద్ధిలో వెన్నెముఖగా ఉన్న విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయటానికి నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానులలో ప్రదర్శనలు జరపాలన్న పిలుపులో భాగంగా ఈ నెల 20న జరుగు చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, పీస్ రేట్ వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని, గ్రేడ్ టు జెవిల్‌ఎంలకు, కారుణ్య నియామకాల్లో ఎపిఎస్‌ఇబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, పీస్ట్ వర్కర్లకు ఉద్యోగభద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వర్కర్లకు రూ.10లక్షల గ్రాట్యూటీ, కోటి రూపాయల ఇన్సూరెన్స్, జెఇ, జెఎ, కన్వర్షన్స్ వేతనాలలో వ్యత్యాసం నివారించాలని, వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ పాటించాలని, కోరారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.చంద్రరావు, వేపాడ సత్యనారాయణ, కె.నాగప్పారావు, కె.కొండలరావు, నాయుడు పాల్గొన్నారు.

రైవాడ కాలవపై బ్రిడ్జికి త్వరలో మోక్షం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి నుండి వయా కొత్తవలస మీదుగా విశాఖపట్నం వెళ్లే ప్రధాన రహదారిపై కృష్ణరాయుపేట వద్ద రైవాడ కాలువపై కృంగిపోయిన బ్రిడ్జికి త్వరలో మోక్షం కలగనుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మూడో సోమవారం సందర్భంగా దేవరాపల్లి మండలం బోయల కింతాడ గ్రామంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన బండారు మాట్లాడుతూ కొత్త వంతెన నిర్మాణానికి జీవీఎంసీ రూ.91 లక్షల నిధులు మంజూరు చేసిందని, ఈ నెల 23న వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగనుందని పేర్కొన్నారు.అచ్యుతాపురం బ్రాండెక్స్ ఇండియా ప్రతినిధి దొరస్వామితో మాట్లాడి దేవరాపల్లి మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల మహిళలకు ఉపాధి కల్పించి బ్రాండెక్స్ బస్సులు ఏర్పాటు చేయించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కాశీపురం-గవరవరం రహదారి పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిమి నాగేశ్వరరావు (కెఎన్ఆర్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ నాయకులు కొమర బాబురావు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో భీమవరం గ్రామంలో వైసీపీ నాయకులు టిడిపిలో చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు అమలకంటే అబద్దం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సుమారు 50మంది వైసిపి నాయకులు కార్యకర్తలు టిడిపిలోకి చేరినట్లు చెప్పారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పార్టీ నాయకులు చేతుల మీదుగా వారికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యేజర్ల వినోద్‌రాజు, ఎంపిపి కె.వెంకటలక్ష్మి, జడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు, కోరుప్రోలు పిఎసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ, డైరెక్టర్ కోన అప్పలరాజు, టిడిపి నాయకులు అల్లు నరసింహమూర్తి పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా శివ అప్పారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చీమలపల్లి గ్రామానికి చెందిన మామిడి శివ అప్పారావును రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. శివ అప్పారావు గ్రామ సర్పంచ్ సేవలందించారు. శివ అప్పారావు నియామకం పట్ల టిడిపి

మ్యాపింగ్ ద్వారా రైతులకు వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

సమాచార సేకరణతోనే గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి-చీడికాడ : సమాచార సేకరణతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం ఖండివరంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 1965 నుంచి 2025 వరకు గ్రామంలో సేకరిస్తున్న విషయాలను అడిగి తెలుసుకుని తద్వారా గ్రామం ఏ విధంగా అభివృద్ధి చెందింది సోషల్ మ్యాపింగ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఎం.అఖిల, ఎల్ చంద్రిక, ఎం జూహిత షామిని, ఆర్.నవ్య దీపిక, సిహెచ్ రమాదేవి పాల్గొన్నారు.

ముంపునకు గురైన పంటల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట శారదా నది పరివాహక ప్రాంతంలో ముంపునకు గురైన పంటలను సోమవారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు సంపత్ వినాయక రైతు సంఘం అధ్యక్షులు పెంటకోట శ్రీను, రైతులు యల్లపు జగ్గారావు, డోకులు సన్నిబాబు, డోకులు గోవిందా మరి కొంతమంది రైతులు జిల్లా గ్రీవెన్స్‌లో సోమవారం పిర్యాదు చేశారు. వరి, చెరుకు సుమారు 500 ఎకరాల వరకు నీటితో నిండి వుందని, తక్షణమే శారద నది గట్టు బాగు చేసి నీరు తీసివేయాలని ఫిర్యాదులు పేర్కొన్నారు. గ్రీవెన్స్ పిర్యాదు మేరకు కశింకోట తాసీల్దార్ తిరుమలరావు ముంపు ఉన్న పంటలను, శారదా నది గట్టును పరిశీలించారు.

మొంథా తుపాన్ వల్ల పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-యలమంచిలి : మొంథా తుఫాను కారణంగా యలమంచిలి మండలంలో ముంపునకు గురైన యాదగిరిపాలెం, నారాయణపురం, తెరువుపల్లి గ్రామాల్లో పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహనరావు సోమవారం తెలిపారు. ముంపు అంచానాలో 25 హెక్టార్లు పేర్కొన్నప్పటికీ రెవెన్యూ, వ్యవసాయశాఖ జాయింట్‌గా జరిపిన ఎన్యూమరేషన్ తర్వాత అది 11 హెక్టార్లకే పరిమితమైందని పేర్కొన్నారు. నష్టపరిహారం తొలుత రూ.6.25 లక్షలుగా పేర్కొన్నప్పటికీ అది ఎన్యూమరేషన్ అనంతరం రూ.2.76 లక్షలుగా నమోదు చేశామని తెలిపారు. నష్టపరిహారం పొందే రైతులు జాబితాలో 67 మంది రైతులు ఉన్నారని వ్యవసాయాధికారి తెలిపారు. నష్టపరిహారం గురించి మాట్లాడుతూ ఎకరానికి రూ.10 వేలు చొప్పున హెక్టారుకు రూ.25వేలుగా లెక్కించడం జరుగుతుందని, ప్రభుత్వం పరిహారం పంపిన వెంటనే రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు.

ఘనంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ (సెట్విజ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ విజయ కృష్ణన్ స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో జానపద నృత్యం, గీతాలు, కథ రచన, పెయింటింగ్, కవిత్వం, ఆవిష్కరణ, డిక్లమేషన్ పోటీలలో విజేతలుగా నిలిచిన వివిధ కళాశాలలకు చెందిన సుమారు 350 మంది యువతీ యువకులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద మెమెంటోలు, ప్రశంసా పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా యువజన సర్వీసుల శాఖ జిల్లా ముఖ్య కార్యనిర్వాహక అధికారి కె కవిత, జిల్లా విద్యాశాఖ అధికారి జి అప్పారావు నాయుడు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి వినోద్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, కరెస్పాండెంట్ వెంకట రామారావు, పెద్దఎత్తున విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తామరబ్బ పాఠశాలకు సౌకర్యాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ యుపి స్కూల్‌కు అదనంగా ఉపాధ్యాయులను నియమించి, తరగతి గదులు, బల్లలు సౌకర్యం కల్పించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న సోమవారం పిజిఆర్ఎస్‌లో వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ స్కూల్‌లో 1 నుండి 5 వరకు 30 మంది, 6, 7, 8 తరగతుల్లో 22 మంది మొత్తం 52 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వీరికి సరిపడా తరగతి గదులు లేవన్నారు. ఇంగ్లీషు, లెక్కలకు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని, తెలుగు, హిందీ, సోషల్, సైన్స్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇద్దరు ఉపాధ్యాయులే రోజుకు 18 క్లాసులు చెబుతున్నారని పేర్కొన్నారు. దీని వలన గిరిజన విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గదిలో కూర్చోవడానికి బల్లలు లేవన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజా సమస్యలపై గ్రీవెన్స్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలోని ప్రజా సమస్యలపై ఏపీ అయల్ ఫీల్డ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి సోమవారం పరవాడలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజలు, స్థానిక నాయకులు, టిడిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై తాము ఎదుర్కొంటున్న సమస్యలను బాబ్జీకి విన్నవించారు. అనంతరం గండి బాబ్జి స్వయంగా ఎంపీడీవో, తహశీల్దారు, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలను సందర్శించి, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జి పరవాడ ప్రాంతంలో రెవెన్యూ సంబంధిత భూమి సమస్యలు, పంచాయతీ పన్నులు వంటి సమస్యలు ఉన్నట్లు చెప్పారు.

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు

ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి : సైబర్ మోసాలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాల రూపంలో సహకరిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. ఇటీవల వ్యాపార పెట్టుబడి పేరుతో భారీ మొత్తంలో మోసం జరిగిన ఘటనలో, పోలీసులు సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి కీలక వివరాలను వెలికితీశారు. బాధితుడు 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, ఎన్సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో, ఆ మొత్తం అనేక బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లకు చేరినట్లు విచారణలో తేలింది. ఆ తర్వాత ఆ డబ్బు క్రిప్టో కరెన్సీ రూపంలో మారి విదేశీ నేరగాళ్లకు చేరినట్లు ఎస్పీ తెలిపారు. "తమ బ్యాంకు ఖాతాలను ఇతరుల లావాదేవీల కోసం ఉపయోగించేందుకు ఇవ్వడం, అవగాహన లేకపోయినా, నేరానికి సహకరించినట్లే పరిగణించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు కఠిన చట్టపరమైన పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరించారు. బ్యాంకు ఖాతాదారులు అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కి కాల్ చేయడం గాని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎంపిటిసి వెంకటేశ్వరరావు

తమ్మయ్యపేటలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దొప్పెర్ల పంచాయితీ తమ్మయ్య పేట గ్రామంలో సోమవారం ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటేశ్వరరావు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వ్యక్తిగత సమస్యలను, రేషన్ కార్డులు, గృహాలు, రెవెన్యూ, డ్రైనేజీ, పింఛన్లు, సీసీ రోడ్లు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు ఆన్‌లైన్ గ్రీవెన్స్‌లో అప్లోడ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కోశాధికారి ముచ్చు గంగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లి వరహాలరావు, నాయకురాలు కొల్లి వెంకటలక్ష్మి, కొల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.

అర్చకుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండల కేంద్రం యస్.రాయవరం గ్రామంలోని శ్రీఉమా సహిత బాల త్రిపుర సుందరి సమేత బుగ్రేశ్వర స్వామి ఆలయ అర్చకులు మహేష్ పంతులు కుటుంబానికి గ్రామస్తులు ఆర్థిక సహాయం అందించారు. గత 40 సంవత్సరాలుగా ఆలయ అర్చకులుగా వున్నా మహేష్ పంతులు గత నెల 29న మరణించడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు సంకల్పించారు. గ్రామ నాయకులు బొలిశెట్టి గోవిందరావు కొంత ఆర్థిక సహాయం అందించగా, గ్రామస్తులతో, చుట్టుపక్కల గ్రామాల వారు మరికొంత విరాళం అందించారు. ఈ మొత్తం రూ.3,54,100ను అర్చకులు మహేష్ పండితులు కుమారునికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొనతల శ్రీను, సోమిరెడ్డి రాజు, బత్తుల వాసు, పులి సత్తిబాబు, ఆడారి శ్రీను, నమ్మి శ్రీను, పక్కుర్తి నాగేశ్వరరావు, నానాజీ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఏపీఈపీడీసీఎల్ పరిధి ఐదు సబ్ స్టేషన్‌ల పరిధిలోని 13 గ్రామాలలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టి అండ్ ఎల్‌టి విద్యుత్తు లైన్లో మరమ్మతులు నిమిత్తం నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. పాయకరావుపేట సెక్షన్ శ్రీరామపురం సబ్ స్టేషన్ పరిధిలో పాల్తేరు గ్రామానికి, ఎలమంచిలి సెక్షన్ పురుషోత్తపురం సబ్‌స్టేషన్ పరిధిలో పురుషోత్తపురం గ్రామానికి, అచ్యుతాపురం సెక్షన్ సబ్ స్టేషన్ పరిధిలో చౌడపల్లి గ్రామానికి, నక్కపల్లి సెక్షన్ గుడిచర్ల సబ్ స్టేషన్ పరిధిలో దేవవరం గ్రామానికి, కొరుప్రోలు సెక్షన్ ఎస్ రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉప్పరపల్లి, వెంకటాపురం, లింగరాజు పాలెం, జీవీ పాలెం, సర్వసిద్ధి, క్రరివానిపాలెం, బసవపాడు, సైదారుపేట, వాకపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభయాంజనేయ ఆలయ 8వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని సైతారుపేట శివారు వేమగిరి జంక్షన్ వద్ద ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం 8వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర రైస్ మిల్ యజమాని తుంపాల వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు అప్పలస్వామి, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, బాబ్జి, సత్తిబాబు, శ్రీను పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామిని దర్శించుకున్న వెంకటేశ్వర్లు తదితరులు

ఘనంగా సిపి.బ్రౌన్ జయంతి వేడుకలు

బ్రౌన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి : చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి సందర్భంగా సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్య అభివృద్ధికి బ్రౌన్ చేసిన కృషి మరపురానిదని పేర్కొన్నారు. తెలుగు నిఘంటువు రూపకల్పనలో ఆయన చేసిన సేవలు భాషా సంరక్షణకు పునాది వేశాయని తెలిపారు. యువత తెలుగు భాషా వారసత్వాన్ని గౌరవించి, సంరక్షించే దిశగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలుగు విభాగం, చరిత్ర విభాగం సంయుక్తంగా చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి వేడులను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీవీఎస్ఎస్ శాస్త్రీ మాట్లాడుతూ తెలుగు బాషకు సీపీ బ్రౌన్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై హరిదాసు కీర్తనలు

ప్రజాశక్తి-యలమంచిలి : మారుతున్న కాలానికి అనుగుణంగా మనిషి వృత్తిలోనూ, వ్యవహార శైలిలోనూ మార్పులు చేసుకుంటూ ఉంటారు. ఇలాగే హరిదాసుల వ్యవహార శైలి కూడా మారుతోంది. హరిదాసులంటే కాలికి చెప్పుల్లేకుండా చిడతలు వాయిస్తూ హరినామ కీర్తనలు స్మరిస్తూ ఇంటింటికీ తిరిగి భిక్షాటన చేసేవారు. మారుతున్న స్పీడు యుగంలో ఆధునిక హరిదాసు ద్విచక్రవాహనంపై తన భిక్షాటన చేస్తున్నారు. తలపై పెట్టుకోవలసిన భిక్షాపాత్రను, పసుపు వర్ణం వస్త్రాన్ని బైక్ హ్యాండిల్‌కు చుట్టి, రికార్డు చేసిన హరినామ కీర్తనలను మైక్‌లో వినిపిస్తూ యలమంచిలి వీధుల్లో తిరుగుతూ సోమవారం కనిపించారు. అనంతశర్మగా చెప్పుకుంటున్న ఆయన యలమంచిలి రామనగర్, ఎఎస్ఆర్ కాలనీ, టిడ్కో ఇళ్ల సముదాయంలో ఉదయం అంతా తిరిగి భిక్షాటన చేశారు. గతంలో రామ గోవిందా నారాయణా అంటూ హరికీర్తనలు స్వీయంగా పాడి ఇంటింటికీ తరిగి వినిపించేవారు. కాని ఈ ఆధునిక హరిదాసు ముందుగా రికార్డు చేసుకున్న కీర్తనలు మైక్‌లో వినిపిస్తూ భిక్షాటన చేయడంతో ప్రజలు ఆశ్చర్యంగా ఆయన వైపు చూశారు.

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న హరిదాసు

బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ సిస్టమ్స్ గ్రాంట్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా తోటాడ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో ఈవోపీఆర్డి సోమరాజుకు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ సూర్య ఘర్ పథకంలో భాగంగా గవర్ల అనకాపల్లి గ్రామంలో ఇప్పటికే 20 మంది సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకునేందుకు మరి కొంతమంది బ్యాంక్ ఆఫ్ బరోడాలో దరఖాస్తులు పెట్టుకోగా అవి గ్రాంట్‌కు నోచుకోక పెండింగ్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ అధికారులకు విన్నవించిన పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. రుణాలు మంజూరు చేయక దరఖాస్తుదారులు పలు అవస్థలు పడుతున్నారని వాపోయారు. తనకు తోటాడ రెవిన్యూలో ఒక ఎకరా భూమి, మూడు పాడి ఆవులు ఉండగా గోకులం షెడ్డు నిర్మాణానికి పంచాయతీలో దరఖాస్తు చేసినా మంజూరు చేయలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకొని రుణాలు మంజూరుకు సహకరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కౌలు రైతు సంఘం నాయకులు కాండ్రేగుల రామ అప్పారావు ఉన్నారు.

వినతిపత్రం ఇస్తున్న మహేశ్వరరావు తదితరులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-సబ్బవరం : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మండలంలోని మొగలిపురం గ్రామ సర్పంచ్ గండి అరుణ అన్నారు. ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఎన్ఎస్ఎస్ శిబిరం మొగలిపురం గ్రామంలో జరిగింది. ఇందులో భాగంగా సోమవారం గ్రామపంచాయతీ సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గండి అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని మండల పరిషత్ పాఠశాల ఆవరణ, రామాలయం ఆవరణలో 50 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తమరాన బంగారునాయుడు, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, అంగటి నానాజీ, గండి నరేష్, రాయవరపు శ్రీను, రామచంద్ర, గండి కిషోర్, గండి కుమార్, రామ్మోహన్, లక్ష్మణ, శ్యామ్, పంచాయతీ సెక్రెటరీ రజిని, పాల్గొన్నారు.

బ్రిక్ ఇండస్ట్రీని సందర్శించిన ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక శ్రీచక్ర జోషిత పాలజీ బ్రిక్ ఇండస్ట్రీని విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ఆర్కిటిక్ (వాస్తు శిల్పి) ప్రథమ సంవత్సరం విద్యార్థులు సోమవారం సందర్శించారు. బ్రిక్స్ ఏ విధంగా తయారు చేస్తున్నారు, తయారీకి కావలసిన ముడి సరుకులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బి రమేష్ బాబు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆర్కిటిక్ బుద్ధ మురళి, బ్రిక్ ఇండస్ట్రీ అధినేత ఆడారి అప్పలనాయుడు, ఆడారి దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

30న సంగీత విభావరి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రత్యేక గాయకులు హైదరాబాద్‌కు చెందిన ప్రదీప్ కుమార్, సింగపూర్ నుంచి హాజరవుతున్న గాయకులు సాయిబాబా చే ఈనెల 30 సాయంత్రం ఐదు గంటల నుంచి అనకాపల్లి రోటరీ క్లబ్లో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ కేఎస్ఎస్ శర్మ, ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డి బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాయకులు ఇద్దరు సోదరులని మెలోడీ, రిథమ్, హార్మోనిపై వీనులువిందైన సినీ గీతాలతో అనకాపల్లి సంగీత ప్రియులను అలరించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంగీత ప్రియులు కళాకారులు కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నందీశ్వరుని ఆలయానికి రోడ్డు, విద్యుత్ కల్పించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ స్వయంభు నందీశ్వరుని ఆలయానికి విద్యుత్ సౌకర్యం, సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నందీశ్వర స్వామి ఆలయానికి ఎటువంటి రహదారి, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

స్వయంభూ నందీశ్వరునికి పూజలు

సబ్బవరం : మండలంలోని పైడివాడలో స్వయంభూ నందీశ్వరుడు ఆలయంలో కార్తీకమాస మూడవ సోమవారం సందర్భంగా స్వయంభూ నందీశ్వరుని శివలింగానికి ఘనంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ దంపతులు నందేశ్వరునికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాతబాబు, దాసరి అక్కునాయుడు, సంతోష్, కర్రి ప్రసాద్, గవర హరికుమార్, రాపర్తి సన్యాసిరావు, బాబురావు, నక్క కనకరాజు, నునగొప్పల అమ్మతల్లి, రమేష్, బొబ్బరి అప్పల రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ

ఆర్ఆర్ కాలనీలో త్వరితంగా గృహాలు పూర్తి చేయాలి

-కలెక్టర్ విజయకృష్ణన్

ఇళ్ల పట్టాలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి మండలం బోదుగల్లం వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ కాలనీలో గుర్తించిన నిర్వాసితులందరూ ఈ నెలలో గృహ నిర్మాణాలు ప్రారంభించి, వేసవి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లో భాగంగా నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు బోదుగల్లం వద్ద ఆర్ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పలువురు నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. గృహ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన పనులు నాలుగు నెలల్లో పూర్తి పూర్తి చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక దృష్టి సారించి త్వరగా నిధులు మంజూరు చేయుటకు కృషి చేయడంతోనే కాలనీలో పనులు వేగవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీఓ వీవి రమణ, తహసిల్దార్ నరసింహమూర్తి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భోజనాలు చేస్తున్న భక్తులు

ఉపమాకలో అన్న సమారాధన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక శివాలయం వద్ద కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శివపార్వతులను దర్శించుకున్నారు. ఆలయం వద్ద హెటిరో కంపెనీ యాజమాన్యం, భక్తుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు.నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ పెద్దలు సహకరించారు. హెటిరో కంపెనీ ప్రతినిధులు ఎంవి సుబ్బారెడ్డి తదితరులు శివపార్వతులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులను కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు శాలువాతో సత్కరించారు.మండలంలో పెదబోదిగల్లం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు బొందలపు లక్ష్మణరావు దంపతులు 50 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని జోగం పేట జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.లీల విష్ణు వర్ధన్, ఎం.నూకరత్నం, ఆర్.సాత్విక రాష్ట్ర స్థాయి అండర్-14 సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మాకవరపాలెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. ఈ సందర్భంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు వి. నాగభూషణం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విద్యార్థులు సత్తా చాటి, జాతీయ స్థాయికి ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సుబ్బారావు, రామరాజు, ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు బి. లోవరాజు, ఈశ్వరరావు, క్రాంతికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నేతల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:పునాదులతో నిలిచిన జూనియర్ కళాశాల హాస్టల్ వసతి భవనం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవన్ .కార్తిక్.లు మాట్లాడుతూ, కళాశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు కనీస హాస్టల్ భవనాలు లేక అద్దె గదులలో ఉంటూ చదువు కొనసాగించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. మరికొంత మంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. కళాశాల చుట్టూ ప్రహరి గోడ, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు

కుట్ర పూరితంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్

వడ్డాదిలో సంతకం చేస్తున్న అమర్నాథ్

ప్రజాశక్తి-వడ్డాది : ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర పూరితంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం వడ్డాదిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ 14ఏళ్ళ ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీని కూడా కట్టలేదని తెలిపారు. వైఎస్ జగన్ 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించారని గుర్తు చేశారు. పేదలకు ఉచిత వైద్య విద్య, ఉచిత వైద్యం అందించాలని ఈ మెడికల్ కాలేజీలను, ఆసుపత్రులను మంజూరు చేశారని, వాటిని ప్రైవేటువారికి ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి నాయకులు దొండా నారాయణమూర్తి, జోగా కొండబాబు, కోవెల జనార్దనరావు, ఎంపీటీసీ కురం రమణ తదితరులు పాల్గొన్నారు.

12న బైక్ ర్యాలీ జయప్రదం చేయండి

తగరపువలస : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు నిరసనగా వైసిపి కోటి సంతకాల సేకరణ, 12న ప్రజాఉద్యమ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని రెండోవార్డు పార్టీ అధ్యక్షుడు చిల్ల భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం కార్యకర్తలు సమావేశంలో మాట్లాడుతూ, చిట్టివలస ఫుట్బాల్ గ్రౌండ్ నుండి భీమిలి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ, వినతిపత్రం సమర్పణ నిరసనలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిల్ల కరుణాకర్ రెడ్డి, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, డబ్బీరు ప్రశాంతి. వంశీరెడ్డి, చిప్పాడ వెంకటేష్, గుండాసు మధునాయుడు, తెడ్డపు అప్పలరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నర్సీపట్నంలో ఈనెల 12న వైయస్సార్సీపి ప్రజా ఉద్యమం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు, సోమవారం పెద్ద బొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసి పాత్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రుతుల ఎర్రపాత్రుడు, జిల్లా మహిళా కమిటీ అధ్యక్షులు జడ్పిటిసి సభ్యులు, మున్సిపల్ చైర్మన్, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో చి దొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గ్రంథాలయ అధికారి కే జనార్దన్ తెలిపారు. 14న వారోత్సవాలు ప్రారంభం, నెహ్రూ జన్మదినం పురస్కరించుకొని బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న క్విజ్, చిత్రలేఖనం, పద్య పఠనపోటీలు 17న వ్యాసరచన పోటీలు, గ్రంథాలయ ఉద్యమానికి కృషిచేసిన అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం వంటి నాయకుల సంస్మరణ దినోత్సవం 18న పాటల పోటీలు (దేశభక్తి గీతాలు), కబాడీ, మ్యూజికల్ చైర్, వాలీబాల్, 19న మహిళా దినోత్సవం, నృత్య పోటీలు 20 న వారోత్సవాలు ముగింపు, వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బండారు చారిటబుల్ ట్రస్ట్ అధినేత బండారు గోవిందరావు వారిచే బహుమతులు ప్రధానం ఉంటుందన్నారు. సోమవారం వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను పలువురికి అందజేసి ఆహ్వానించారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

ఎంపిడిఒ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ఎంపిడిఒగా అదనపు పూర్తి బాధ్యతలను డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావుకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి అప్పగించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఎంపిడిఒకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నివాళి అర్పిస్తున్న అటవీ ఉద్యోగులు

అటవీ అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో సోమవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఫ్లైయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ విశాఖపట్నం ఎ.సునీల్కుమార్ హాజరై విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : అంతర్ల గ్రామపంచాయతీ పరిధి కొత్తవీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ పనులను ఎంపీపీ నిధులతో చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనూషాదేవి ప్రజల సహకారంతో వీధికి సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దూరియా పుష్పలత, ఎంపీటీసీలు దాసరి ధర్మలక్ష్మి, చి.జయలక్ష్మి, వైసిపి నాయకులు జల్లి సుధాకర్, బుసరి కృష్ణ, పి.పరమేష్, గంగన్న పడాల్ లంగి నాగేశ్వరరావు, కార్యదర్శి కావడం శివసంతోష్ పాల్గొన్నారు.

58వ రోజుకు మత్స్యకారుల రిలే దీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దని మత్స్యకారులు తెలిపారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు సోమవారం నాటికి 58వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్ ఏర్పాటు వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలు సర్వనాశనం అవుతాయని, ప్రభుత్వం తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు ఆందోళన శిబిరం వద్ద మధ్యాహ్నం భోజనం చేసి, పోరాటాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు, కాశీ రావు, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

నినాదాలు చేస్తున్న కార్మికులు

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం: పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ పరికరాలు అందజేయాలని సిఐటియు నేత ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. సోమవారం మాకవరపాలెం మండలంలో పారిశుధ్య కార్మికులతో మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వారికి కావాల్సిన శానిటరీ పరికరాలు కూడా సకాలంలో అందించకపోవడంతో వివిధ వ్యాధులకు గురవుతున్నారన్నారు. అనంతరం కార్మికులు వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ నాయకులు కృష్ణయ్య, కృష్ణ, నూకరాజు పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మెడికల్ రిప్రజెంటేటివ్స్ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17న ముంబైలో నిర్వహించే ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం అఫీషియల్ కాలనీలోని కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పివి.సుధాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ మాట్లాడుతూ, హైలీ స్కిల్డ్ కేటగిరిగా సేల్స్ రెప్రజెంటేటివ్‌లను గుర్తించాలని, స్కిల్డ్ కేటగిరీగా నిర్ణయించి జీతాలు ఇవ్వాలని, నిర్దిష్టమైన పని గంటలు నిర్ణయించాలని డిమాండ్‌చేశారు. భారతదేశానికే ఫార్మా సూటికల్స్ హబ్‌గా ఉన్న ముంబైలో ఈనెల 17వ తేదీన సౌత్, వెస్ట్‌లో ఉన్న మెడికల్ రెప్రజెంటేటివ్స్ అందరూ డిమాండ్ల సాధన కోసం నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లు తమ వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం కలిగే జిపిఎఫ్, జిపిఆర్ఎస్ రిపోర్టింగ్ సిస్టమ్‌ను తీసివేయాలని, సేల్స్ పరంగా మెడికల్ రిప్రజెంటేటివ్ ఒక్కరినే బాధ్యులను చేస్తూ ఉద్యోగాల నుండి తొలిగించడం ఆపాలని, నార్త్ ఈస్ట్‌లో ఉన్న మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఢిల్లీ రాజధానిలో నిరసన తెలియజేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మందుల ధరలు తగ్గించాలని, నకిలీ నాసిరకం మందులు అరికట్టాలని, నల్ల బజారులో మందులు అమ్మకాలు ఆపాలని, మహిళలకు ఆరు మాసాలు మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని, మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు ప్రొడక్ట్స్ పూర్తిగా డాక్టర్లకు వివరించటానికి ప్రభుత్వం హాస్పిటల్‌లో అనుమతించాలని, ఫార్మసిటికల్ రంగాన్ని కాపాడాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.సంజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు సన్యాసిరావు, శ్రీనివాస్, కోశాధికారి రామారావు పాల్గొన్నారు.

మాతృభాష మనుగడ కోసం దీక్ష

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : మాతృభాష మనుగడ కోసం తెలుగు దండు ఆధ్వర్యాన టిట్టిభా సత్యాగ్రహం పేరుతో నిరవధిక నిరాహార దీక్ష కార్యక్రమాన్ని తెలుగు దండు వ్యవస్థాపకులు పరవస్తు ఫణిశయన సూరి సోమవారం చేపట్టారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన ఈ దీక్షలో చిన్నయ్య సూరి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాలన, న్యాయ పాలన, ప్రాథమిక విద్యా బోధన తెలుగులోనే జరగాలని కోరారు. విద్య వైద్యం ఉచితంగా అందించాలన్నారు. సంపూర్ణ మధ్య నిషేధం అమలు చేయాలని కోరారు. కవులను, కళాకారులను జాతి సొత్తుగా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఆంగ్లం ఒక పాఠ్యాంశంగా మాత్రమే ఉండాలన్నారు. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని, పదో తరగతి వరకు ప్రథమ భాషగా, తర్వాత డిగ్రీ వరకు ద్వితీయ భాషగా తెలుగు ఉండాలని, అన్ని పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఆయనకు సంఘీభావంగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ పాల్గొన్నారు.

రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొండ నాయుడు

ప్రజాశక్తి- రావికమతం: రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన రావికమతం మండల టిడిపి పూర్వపు అధ్యక్షుడు రాజాన కొండనాయుడు నియామకం పట్ల మండలంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కొండ నాయుడు మాట్లాడుతూ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతను శిరసా వహించి బాధ్యతాయుతంగా పని చేస్తానని తెలిపారు. తాను గ్రామ సర్పంచ్గా, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడిగా, తనకు అప్పగించిన డైరెక్టర్ పదవికి తాను శాయశక్తులా కష్టపడి కాపుల సంక్షేమంకు కష్టపడి పని చేస్తానని ఆయన తెలిపారు.

అభినందిస్తున్న నేత

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ద్వారా మినీరత్న సర్టిఫికెట్‌ను అందుకుంటున్న హెచ్‌ఎస్‌ఎల్ సిఎమ్‌డి గిరిదీప్‌సింగ్

'మినీ రత్న' హోదా అందుకున్న హెచ్‌ఎస్‌ఎల్

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఢిల్లీలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌కు (హెచ్‌ఎస్‌ఎల్) 'మినీరత్న' హోదా సర్టిఫికేట్‌ను లాంఛనంగా అందజేశారు. హెచ్‌ఎస్‌ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కమాండర్ గిరిదీప్ సింగ్ ఈ సర్టిఫికెట్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2025ను 'సంస్కరణల సంవత్సరం' గా ప్రకటించారు. ఆత్మనిర్భర్‌భారత్‌లో భాగంగా, భారతదేశం పరిశోధన అభివృద్ధి, స్వదేశీకరణ రక్షణ ఎగుమతులపై దృష్టి సారించినట్లు ఆయన ఆయన తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గుంటసీమ రోడ్డు హైస్కూల్ పక్కన ఉన్న టిక్కిలి బెడ్డ వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ వీధి గ్రామస్తులు కోరుతున్నారు. గుంటసీమ రోడ్డు వీధి దీపాలు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రుల్లో చీకటిగా ఉంటుందని స్థానికులు తెలిపారు.

యూరియా కోసం తోపులాట

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కోసం సోమవారం తోపులాటలు చోటుకేసుకున్నాయి. ఈ మండలంలోని పులపర్తి, పోతిరెడ్డిపాలెం, షేకిల్లపాలెం, యలమంచిలి, సోమలింగపాలెం రైతు సేవా కేంద్రాల్లో సోమవారం యూరియా ఇవ్వడానికి ఏర్పట్లు చేశారు. ఇది తెలిసిన రైతులు ఉదయం 7 గంటల నుంచే రైతు సేవ కేంద్రాల వద్ద బారులు తీరారు. అన్ని కేంద్రాల్లోనూ యూరియా పంపిణీ ప్రారంభం కాకుండానే తోపులాటలు చోటుచేసుకున్నాయి. దీంతో యూరియా పంపిణీ నిలిపివేశారు. కొద్ది సమయం తరువాత అన్ని కేంద్రాల్లో యూరియా పంపిణీ ప్రారంభమైనా, పోతిరెడ్డిపాలెంలో పంపిణీ చేయలేదు. దీనిపై యలమంచిలి మండల వ్యవసాయశాఖ అధికారి మోహనరావును ప్రజాశక్తి సంప్రదించగా, యలమంచిలి, సోమలింగపాలెం, షేకిల్లపాలెం, పోతిరెడ్డి పాలెం, పులపర్తి ఐదు రైతు సేవా కేంద్రాల్లో 50 టన్నులు (1000 బస్తాలు) స్టాక్ ఉందని, తోపులాటల వలన తాత్కాలికంగా నిలిపివేశామని తెలిపారు. మంగళవారం పోలీస్ బందోబస్త్ తీసుకొని పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం వరిచేలు పొట్టలు దశలో ఉన్నాయని, ఈ సమయంలో యూరియా, పొటాస్ కచ్చితంగా వేయాలని, అందుకే యూరియా కోసం పోటీ ఎక్కువైందని తెలిపారు.

రైతు సేవా కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో క్యూ కట్టిన రైతులు

క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్, పిజిఆర్ఎస్ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా గృహనిర్మాణం పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 239 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కారం కాని అర్జీల గురించి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. పిజిఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీల సమాచారం కోసం ప్రజలు 1100 కాల్ చేసి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, జిల్లా సర్వే, భూ రికార్డుల భద్రత సహాయ సంచాలకులు గోపాలరాజు, డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు శచిదేవి, కె సరోజినీ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.హైమావతి, పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 50 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రజల నుంచి మొత్తం 50 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు 19, కుటుంబ కలహాలు 2, మోసానికి సంబంధించిన - 2, ఇతర విభాగాలకు చెందినవి 27 ఉన్నాయి. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వ జిఒ అమలు చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని పంచాయతీల్లో పని చేసే గ్రీన్ అంబాసిడర్లకు జీతం, మెడికల్ అలవెన్స్‌కు సంబంధించి ప్రభుత్వ జిఒను తక్షణమే అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఈ.నాయుడుబాబు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు వారి నెల జీతంతో పాటు మెడికల్ అలవెన్స్ 4000 రూపాయలు కలిపి నెలకు రూ.10వేలు వేయాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని, ఈ జిఒ పత్రం మండల అధికారులకు కూడా అందించడం జరిగిందని తెలిపారు. కానీ అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అమలు జరపడం లేదని, జీతాలు కూడా ఇప్పటికి వేయని చాలా గ్రామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండలస్థాయి అధికారులు జోక్యం చేసుకొని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పదివేల రూపాయలు అన్ని గ్రామాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు.